సాక్షి
వికారాబాద్
శుక్రవారం, 17, మే, 2024



నిలిచిన ధాన్యం కొనుగోళ్లు

భూగర్భజలాలు ఎండిపోవడంతో వరిపైరుకు నీరందక అన్నదాతలు అష్టకష్టాలు పడి పంటను కొంత మేర కాపాడుకున్నారు. 8లో▸



గ్యాస్ కష్టాలు

కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ వంట గ్యాస్ కనెక్షన్లు ఇచ్చినా వినియోగదారులకు సబ్సిడీ అందడం లేదు. 8లో▸



చినుకు పడితే చిత్తడే

ముఖ్యమంత్రి ఇలాకా అయిన కొడంగల్ బస్టాండ్‌పై ఆర్టీసీ అధికారులు చిన్న చూపు చూస్తున్నారు. 9లో▸

న్యూస్‌రీల్

రైతులకు ఇబ్బందులు రానివ్వొద్దు

అదనపు కలెక్టర్ లింగ్యానాయక్



రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

బొంరాస్‌పేట: ధాన్యం విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా చూడాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ సూచించారు. మండల కేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాన్ని గురువారం తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతులు ధాన్యాన్ని తెచ్చిన వెంటనే కొనుగోలు చేయాలని కేంద్రం నిర్వాహకులకు సూచించారు. వర్షాలు పడుతున్నందున ధాన్యం తడవకుండా చూడాలన్నారు. క్వింటాలు వడ్లకు ప్రభుత్వం రూ.2,203 మద్దతు ధర ప్రకటించిందని తెలిపారు. ధాన్యంలో తేమ 17శాతం ఉండాలన్నారు. గన్నీ బ్యాగుల కొరత లేదన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు.

కొనుగోలు కేంద్రం పరిశీలన

పరిగి: మండలంలోని సుల్తాన్‌పూర్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు దళారులను నమ్మి మోసపోరాదని సూచించారు. ప్రస్తుతం వర్షాలు పడుతున్నందున కొనుగోలు కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఎస్‌ఓ రాజేశ్వర్, డీఎం సుగుణబాయి తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

వ్యవసాయశాఖ జిల్లా అధికారి గోపాల్



ధాన్యం కొనుగోలును పరిశీలిస్తున్న గోపాల్ తదితరులు

దౌల్తాబాద్: ఎరువుల దుకాణాల్లో నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని వ్యవసాయశాఖ జిల్లా అధికారి గోపాల్ హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున రైతులకు నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచాలన్నారు. అనంతరం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఏఓ లావణ్య, ఏఈఓ వైష్ణవి పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్ భద్రతపై అప్రమత్తంగా ఉండాలి

కలెక్టర్ శశాంక



స్ట్రాంగ్‌రూమ్ వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ శశాంక

చేవెళ్ల: ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ వద్ద భద్రతపై అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని అధికారులకు కలెక్టర్ శశాంక సూచించారు. మండలంలోని గొల్లపల్లి సమీపంలో ఉన్న బండారి శ్రీనివాస్ ఇంజనీరింగ్ కళాశాలలో వద్ద ఈవీఎంలను భద్రపర్చిన స్ట్రాంగ్ రూంలను గురువారం వెబ్ క్యాస్టింగ్ స్క్రీనింగ్ ద్వారా పరిశీలించారు. నిరంతరం నిఘా కోసం అమర్చిన క్లోజ్డ్ సర్క్యూట్ కెమెరాల పనితీరు, వాటి ద్వారా కొనసాగిస్తున్న పర్యవేక్షణను పరిశీలించారు. అక్కడ ఉండే అధికారులకు పలు సలహాలు, సూచనలు చేశారు. ఆయన వెంట చేవెళ్ల ఆర్డీఓ సాయిరాం, కందుకూరు ఆర్డీఓ మహేశ్వరం తహసీల్దార్ సూరజ్‌కుమార్, చేవెళ్ల తహసీల్దార్ కృష్ణయ్య, చేవెళ్ల ఏసీపీ బి.కిషన్ ఉన్నారు.

కనీస వేతనాలివ్వండి

ఆదర్శ పాఠశాలల పీడీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆంజనేయులు

చేవెళ్ల: కాంట్రాక్టు ఉద్యోగులకు కనీస వేతనాలు ఇవ్వాలని ఆదర్శ పాఠశాలల పీడీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆంజనేయులు కోరారు. ఈ మేరకు ఆయన సంఘ నాయకులతో నగరంలోని బీఆర్‌కే భవనంలో వేతన సవరణ కమిషన్ చైర్మన్ శివశంకర్‌ను కలిసి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ.. ఆదర్శ పాఠశాలల్లో పనిచేస్తున్న ఫిజికల్ డైరెక్టర్లను కాంట్రాక్టు విధానంలోకి మార్చి, పే స్కేల్ ఇవ్వాలని కోరారు.



నాగారం కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యం తడవకుండా కవర్ కప్పుతున్న రైతు దంపతులు

అకాల వర్షం.. తడిసిన ధాన్యం

జిల్లా వ్యాప్తంగా గురువారం భారీ వర్షం పడింది. అకాల వర్షానికి కల్లాలు, కొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టిన ధాన్యం తడిసిపోయింది. దీంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. టార్పాలిన్లు ఉన్నా భారీగా వరద రావడంతో వడ్లు నీటి పాలయ్యాయి. ఎలాంటి షరతులు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని అన్నదాతలు ప్రభుత్వాన్ని కోరారు. మే నెల మొత్తం ఎండ తీవ్రత భారీగా ఉంటుందని ప్రజలు భావించారు. వారం రోజులుగా వర్షాలు పడుతుండటంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. దీంతో జనం వేసవి నుంచి ఉపశమనం పొందారు. – ధారూరు



ధాన్యం కుప్ప వద్ద నిలిచిన నీటిని ఎత్తిపోస్తున్న రైతు

టెన్షన్.. టెన్షన్!

ఓటింగ్ సరళిపై ఆందోళనలో అధికార పార్టీ ఎమ్మెల్యేలు

- లోక్‌సభ ఎన్నికల్లో అనుకూల ఫలితాలు రాకుంటే 'స్థానిక' సమరంపై ప్రభావం
- బీఆర్‌ఎస్ చేతులెత్తేయడంతో మరింత సంకట పరిస్థితి



వికారాబాద్: లోక్‌సభ ఎన్నికల పోలింగ్ సరళి చూశాక జిల్లాకు చెందిన అధికార పార్టీ ఎమ్మెల్యేల్లో టెన్షన్ మొదలైంది. కమలం పార్టీ పుంజుకోవడంతో కాంగ్రెస్ నేతలు ఈ ఎన్నికలను సవాల్‌గా తీసుకొని పనిచేశారు. పోలింగ్‌కు ముందే బీఆర్‌ఎస్ నేతలు చేతులెత్తేయడం కాంగ్రెస్‌కు మరింత సంకట పరిస్థితిని తెచ్చిపెట్టింది. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతిపక్ష హోదాలో సత్తా చాటిన హస్తం పార్టీ ఇప్పుడు అధికారంలో ఉంది. జిల్లాకు చెందిన వారే సీఎంగా, స్పీకర్‌గా ఉన్నారు. మిగతా రెండు నియోజకవర్గాల్లో సైతం ఆ పార్టీ వారే ఎమ్మెల్యేలుగా ఉన్నారు. లోక్‌సభ సమరానికి సై అన్న వారికి పోలింగ్ సరళి చెమటలు పట్టేలా చేసింది. జూన్ 4న వెలువడే ఫలితాలు ఎలా ఉండబోతాయి అనే ఆందోళనలో వారు ఉన్నట్లు సమాచారం.

బీఆర్‌ఎస్‌కు వచ్చే ఓట్లపైనే కాంగ్రెస్ భవితవ్యం

లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ఏ మేర ఓట్లు వస్తాయి అనే దానిపైనే కాంగ్రెస్ గెలుపోటములు ఆధారపడతాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. జిల్లాలో ప్రధాన పోటీ కాంగ్రెస్, బీజేపీల మధ్యే ఉందనే విషయం పోలింగ్ ముగిశాక స్పష్టత వచ్చిందని వారంటున్నారు. కేవలం కొడంగల్ నియోజకవర్గంలోనే 40 వేలకు పైగా మెజారిటీ వస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి పోలింగ్‌కు ముందే ధీమా వ్యక్తం చేశారు.. ఆయన రెండు సార్లు కేడర్‌తో సమావేశం కావడంతో పాటు ప్రచారం కూడా చేశారు. అది ఆయన సొంత నియోజకవర్గానికే పరిమితమైంది. సీఎంగా బాధ్యతలు స్వీకరించాక కొడంగల్ నియోజకవర్గంపైనే నిధులు కుమ్మరించారు. జిల్లాలోని మిగిలిన మూడు నియోజకవర్గాల ఊసే లేదు. ఈ ప్రభావం ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో కనిపిస్తుందా..? అనే చర్చ జరుగుతోంది.

మెజార్టీ వచ్చేనా ?

అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీకి 75,888 మెజార్టీ వచ్చింది. సీఎం రేవంత్‌రెడ్డికి 32,720 మెజార్టీ రాగా పరిగిలో రామ్మోహన్‌రెడ్డికి 23,955, వికారాబాద్‌లో ప్రసాద్‌కుమార్‌కు 12,672, తాండూరులో మనోహర్‌రెడ్డికి 6,538 మెజార్టీ వచ్చింది. మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలోకి వచ్చే కొడంగల్‌ను మినహాయిస్తే చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోకి వచ్చే మూడు నియోజకవర్గాల్లో కలిపి 43,168 మెజార్టీ వచ్చింది. ఆ ఎన్నికల సమయంలో వారంతా ప్రతిపక్ష పార్టీ తరఫున పోటీ చేస్తున్న మాజీలు కాగా ఇప్పుడు అధికార పార్టీ ఎమ్మెల్యేలు, సీఎం, స్పీకర్ హోదాలో ఉన్నారు. ఈ క్రమంలో వారి పరువు నిలవాలంటే చేవెళ్ల, మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానాల్లో గెలుపు అనివార్యమనే చెప్పవచ్చు. గత మెజార్టీని మించి తెచ్చుకోవాల్సిన పరిస్థితి తలెత్తింది. ఇదిలా ఉండగా లోక్‌సభ ఎన్నికల్లో కమలం బాగా వికసించిందనే టాక్ ఉంది. ఈ పరిణామాల నేపథ్యంలో అధికార పార్టీ ఎమ్మెల్యేల్లో ఆందోళన మరింత పెరిగింది. జూన్ 4న ఫలితాలు వచ్చే వరకు అధికార పార్టీ ఎమ్మెల్యేల్లో ఆందోళన తప్పదనే చెప్పవచ్చు.

డెంగీని అరికడదాం



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ పల్వన్ కుమార్ తదితరులు

డీఎంహెచ్‌ఓ పల్వన్ కుమార్

అనంతగిరి: కనీస జాగ్రత్తలు పాటిస్తే డెంగ్యూను అరికట్టవచ్చని, ఇది మనందరి బాధ్యత అని డీఎంహెచ్‌ఓ పల్వన్‌కుమార్ అన్నారు. జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం డీఎంహెచ్‌ఓ కార్యాలయం నుంచి అవగాహనా ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించినట్లు తెలిపారు. 2030 నాటికి దోమలతో వ్యాపించే వ్యాధులను పూర్తిస్థాయిలో నిర్మూలించడమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని తెలిపారు.కొన్నేళ్లుగా ప్రజల్లో ఆరోగ్య సంరక్షణపై అవగాహన పెరగడం వల్ల డెంగ్యూ కేసుల సంఖ్య బాగా తగ్గిందని తెలిపారు. డెంగ్యూ నివారణకు ఇంటి పరిసరాల్లో నీరు నిలవకుండా చూసుకోవాలన్నారు. పనికి రాని పాత్రలు, పాత టైర్లు, నీటి తొట్టెలు, వాడి పడేసిన ప్లాస్టిక్ వస్తువులు, కొబ్బరి బోండాలు, పగిలిన కప్పులు, కుండలు వంటివి పరిసరాల్లో ఉండకుండా చూడాలన్నారు. ఓవర్ హెడ్ ట్యాంకులు,నీటి సంపులు, డ్రమ్ములు, నీటి తొట్టెలపై మూతలు ఉంచాలన్నారు. ప్రతి శుక్రవారం ఇంట్లోని నీటిని పారబోసి కొత్తగా పట్టుకోవాలని సూచించారు. దోమ తెరలు, కాయిల్స్ వాడాలన్నారు. గ్రామాలు, పట్టణాల్లో ఫాగింగ్ చేయడం, నీటి గుంటల్లో ఆయిల్ బాల్స్ వేయడం, గంబుషియా చేపలను వదలడంతో దోమల పెరుగుదలను అరికట్టవచ్చని తెలిపారు. కొన్నేళ్లుగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ నిరంతర పర్యవేక్షణ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా జిల్లాలో డెంగ్యూ కేసుల సంఖ్య గణనీయంగా తగ్గిందని తెలిపారు. ఈ సంవత్సరం కేవలం 5 కేసులు మాత్రమే నమోదయ్యాయని తెలిపారు.అనంతరం జోనల్ మలేరియా అధికారి రామ్‌కుమార్ మాట్లాడుతూ..డెంగ్యూ నివారణ చర్యలు తీసుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు జీవరాజ్, రవీంద్రయాదవ్, సాయిబాబా, కార్యాలయ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



శ్రీశైలం జాతీయ రహదారిపై నిరసన తెలుపుతున్న సబితారెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు

ఓట్లు పడగానే.. మాట మార్చారు

సన్నవడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామనడం రైతులను వంచించడమే..

- దొడ్డు వడ్లకు సైతం రూ.500 బోనస్ ఇవ్వాలి
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి

ధారూరు/మహేశ్వరం: రైతు పండించిన దొడ్డు వడ్లకు రూ.500 బోనస్ ఇవ్వకపోవడం రైతులను వంచించడమే అని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి పేర్కొన్నారు. దొడ్డు వడ్లకు ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో గురువారం మండల పరిధిలోని మహేశ్వరం గేటు వద్ద శ్రీశైలం జాతీయ రహదారిపై బైఠాయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని విమర్శించారు. అధికారం రాక ముందు రేవంత్‌రెడ్డి ప్రగల్భాలు పలికి అధికారం వచ్చాక రైతులను ఏమాత్రం పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. లోక్‌సభ ఎన్నికలు ముగియగానే కేవలం సన్నవడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామని చెప్పడం అన్నదాతలను మోసం చేయడమేనని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో 90 శాతం మంది రైతులు దొడ్డు వడ్లనే పండిస్తారని అన్నారు. ఓట్లు పడగానే రైతుల అవసరం తీరిందని, అందుకే నాలుక తిప్పేశారన్నారు. ఇటీవల వర్షాలకు తడిసిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. రైతుల పక్షాన బీఆర్‌ఎస్ పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. అంతకు ముందు మహేశ్వరం గేటు వద్ద తెలంగాణ అమరుడు సిరిపురం యాదయ్య విగ్రహానికి ఆమె నివాళులర్పించారు. బీఆర్‌ఎస్ నేతల ఆందోళనతో తుక్కుగూడ నుంచి తుమ్మలూరు గేటు వరకు వాహనాలు నిలిచి పోయాయి. దీంతో పోలీసులు సర్దిచెప్పడంతో వారు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో ఎస్సీ కమిషన్ మాజీ సభ్యుడు చిలకమర్రి నర్సింహ, మహేశ్వరం, కందుకూరు పీఏసీఎస్ చైర్మన్లు మంచె పాండు యాదవ్, చంద్రశేఖర్, వైస్ చైర్మన్లు దేవరంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, విజేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సురసాని సురేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు హన్మగళ్ల చంద్రయ్య, అరవింద్ శర్మ పాల్గొన్నారు.

నిరసనల వెల్లువ

అనంతగిరి: కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని బీఆర్‌ఎస్ నాయకులు ఆరోపించారు. పార్టీ అధిష్టానం పిలుపు మేరకు గురువారం అన్నదాతలకు మద్దతుగా జిల్లాలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని విమర్శించారు. ధాన్యానికి బోనస్ ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. అలాగే అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. లేకుంటే ఆందోళన కార్యక్రమాలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.



ధారూరు: గట్టెపల్లి కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆనంద్

జిల్లాకు నీటి సంరక్షణ అవార్డు

- గ్రామాల్లో పర్యటించిన కేంద్ర బృందం
- క్షేత్రస్థాయిలో జరిగిన పనులపై ఆరా



కేంద్ర జలవనరుల శాఖ అధికారులకు వివరాలు తెలియజేస్తున్న అడిషనల్ కలెక్టర్ రాహుల్‌శర్మ

అనంతగిరి: జాతీయ వాటర్ అవార్డుకు జిల్లా ఎంపికైంది. ఇందులో భాగంగా గురువారం కేంద్ర జలవనరుల శాఖ, భూగర్భ జల బోర్డు సభ్యుల బృందం సభ్యులు కే శంకర్, డిప్యూటీ డైరెక్టర్ టీ మాధవ్, శాస్త్రవేత్తలు జిల్లాలో పర్యటించారు. నీటి సంరక్షణ కోసం జిల్లాలో తీసుకుంటున్న చర్యల గురించి అడిషనల్ కలెక్టర్ రాహుల్‌శర్మతో చర్చించారు. అనంతరం డీఆర్‌డీఏ కార్యాలయానికి వచ్చి గ్రామాల్లో నీటి సంరక్షణ పనులపై ఆరా తీశారు. వికారాబాద్ మండలం పులుమద్దిలో ఉపాధి హామీ పథకం, పీఎం కేఎస్‌వై పథకాల్లో భాగంగా భూగర్భ జలాల పెంపు కోసం చేపట్టిన నీటి కుంటలు, ఫారం పాండ్లు, వ్యక్తిగత ఇంకుడు గుంతలు, కమ్యూనిటీ నీటి గుంతలు, కందకాలు, పల్లె ప్రకృతి వనాలు, బృహత్ పల్లె ప్రకృతి వనాలు, చెక్ డ్యాంలను పరిశీలించారు. గ్రామంలో పథకాల అమలుకు ముందు ఆ తరువాత పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అటవీశాఖ ఆధ్వర్యంలో జిల్లాలో చేపట్టిన రాతి కట్టడాలు, గులక రాళ్ల కట్టలు, కందకాలు, చెక్ డ్యాంలను పరిశీలించారు. నవాబ్‌పేట మండలం గంగ్యాడ గ్రామంలో ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో నిర్మించిన చెక్ డ్యాంను పరిశీలించారు. పూడూరు మండలం మీర్జాపూర్‌లో నీటి సంరక్షణ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ శ్రీనివాస్, జెడ్పీ సీఈఓ సుధీర్, వికారాబాద్ ఎంపీడీఓ వినయ్‌కుమార్, ఎంపీఓ నాగరాజు, వాటర్ షెడ్ పీఓ సతీష్‌రెడ్డి, జేఎస్‌ఏ జిల్లా కోఆర్డినేటర్ సైదులు, ఐఈసీ నోడల్ అధికారి శ్రీధర్, ఏపీఓ శ్రీనివాస్, ఈసీ నవీన్, టీఏ భీమయ్య, ఎఫ్ఏ కిష్టయ్య, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

రుణమాఫీకి కసరత్తు

- అర్హుల జాబితా రూపకల్పనలో అధికారులు నిమగ్నం
- కటాఫ్, రెన్యూవల్ చేసుకున్న రుణాలపై స్పష్టత కరువు
- అన్నదాతల్లో ఒకవైపు ఆశలు, మరోవైపు ఆందోళన



షాద్‌నగర్‌లో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయం

సాక్షి, రంగారెడ్డి జిల్లా/షాద్‌నగర్: రైతులకు ఆగస్టు 15లోగా రూ.2 లక్షలలోపు రుణాలను మాఫీ చేయనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ప్రతి సభలోనూ ఆయన రైతులకు హామీ ఇచ్చారు. ఈ క్రమంలో పోలింగ్ ముగియడంతో రుణమాఫీకి సంబంధించిన కసరత్తు మొదలైంది. అధికారులు అర్హులైన రైతుల వివరాలు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. దీంతో పంటల సాగు కోసం బ్యాంకులు, పీఏసీఎస్‌లలో రుణాలు పొందిన వారిలో ఆశలు చిగురిస్తున్నాయి.

స్పష్టత కరువు

మరోవైపు ఎప్పటిలోగా రుణాలు తీసుకున్న వారికి రుణమాఫీ వర్తిందనే అంశంపై స్పష్టత లేకపోవడంతో రైతుల్లో కాస్త ఆందోళన మొదలైంది. కుటుంబంలో ఒకే రైతుకు పరిమితం చేస్తారా.. లేదా ఎంత మంది తీసుకుంటే అంత మందికి మాఫీ వర్తింపజేస్తారా అనేది తేలాల్సి ఉంది. అంతేకాదు ఆయా బ్యాంకుల ఒత్తిళ్ల మేరకు ఇప్పటికే రుణాలు రీ షెడ్యూల్ చేసుకున్న రైతులకు రుణమాఫీ పథకం వర్తిస్తుందా లేదా అనే దాని విషయంలోనూ స్పష్టత కరువైంది.

కటాఫ్ తేదీలు ఇవే..

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ బ్యాంకులు 370 శాఖలు ఉండగా, గ్రామీణ బ్యాంకులు 57, ప్రైవేటు బ్యాంకులు 202 వరకు కలిపి మొత్తం 629 ఉన్నాయి. వీటిలో ప్రభుత్వ, గ్రామీణ బ్యాంకులు రైతులకు ఎక్కువగా పంట రుణాలు మంజూరు చేశాయి. 2019 ఏప్రిల్ 1 నుంచి 2023 డిసెంబర్ 10వ తేదీ మధ్య రూ.2లక్షలలోపు రుణాలు తీసుకున్న, రెన్యూవల్ చేసుకున్న రైతులకు మాఫీ వర్తిస్తుందని సీఎం సహా మంత్రులు ప్రకటించారు. దీని ప్రకారం అధికారులు జాబితాలను సిద్ధం చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సహకార బ్యాంకులు, ఏపీజీవీబీ బ్యాంకు, వ్యవసాయ సహకార సంఘాల వారే అధిక శాతం రైతులకు పంట రుణాలు మంజూరు చేశారు. గత ప్రభుత్వం దశల వారీగా రుణమాఫీ చేసింది. రూ.25వేలు, రూ.50వేలు, ఆ తర్వాత లక్షలోపు రుణాలను మాఫీ చేసింది. ఈ క్రమంలో రుణాలను సకాలంలో రెన్యూవల్ చేయించని వారికి మాఫీ జరగలేదు. కొత్త ప్రభుత్వం ప్రకటించిన కటాఫ్ తేదీల్లోనూ ఈ రైతులకు చోటు దక్కలేదు. సకాలంలో రుణాలను రెన్యూవల్ చేయించుకోని రైతులు సహకార సంఘాల్లో చాలా మంది ఉన్నారు. ఇలాంటి రైతులు కూడా తమ రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

గతంలో రూ.420 కోట్లు మాఫీ

2014 ఏప్రిల్ ఒకటి నుంచి 2018 డిసెంబర్ 18లోపు రుణం తీసుకున్న రైతులకు గత ప్రభుత్వం కుటుంబానికి రూ.లక్ష చొప్పున వడ్డీతో కలిపి నాలుగు విడతల్లో రుణాలను మాఫీ చేసింది. జిల్లా వ్యాప్తంగా 1,43,278 మంది రైతులు రుణాలు తీసుకోగా వీరిలో ఇప్పటి వరకు 74,701 మంది రైతులకు రూ.420 కోట్ల రుణాలు మాఫీ అయ్యాయి. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం 2023 డిసెంబర్ వరకు తీసుకున్న రుణాలకు కూడా మాఫీ చేయనున్నట్లు ప్రకటించింది. పాత రుణాలే పెద్ద సంఖ్యలో పేరుకుపోగా, కొత్తవారికి ఏ విధంగా రుణమాఫీ చేస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది.

క్లుప్తంగా

పోలీసులపై ఆరోపణలు సరికాదు

ఎస్‌ఐ విఠల్‌రెడ్డి

తాండూరు రూరల్: తాండూరు పట్టణం బసవేశ్వర్‌నగర్‌లో రెండు రోజుల క్రితం కుక్కదాడిలో మృతి చెందిన చిన్నారి మృతిపై పోలీసులు విచారణ చేపట్టారు. చిన్నారిని చిదిమేసిన కుక్క పెంపుడుదా.. లేక ఊర కుక్క అనే విషయంలో గురువారం ఘటన స్థలానికి వెళ్లి చిన్నారి తల్లిదండ్రులతో పాటు తోటి కార్మికుల నుంచి వివరాలు సేకరించారు. పాలిషింగ్ యూనిట్ ప్రాంతంలో తిరిగే ఊర కుక్క అని కార్మికులతో పాటు స్థానికులు చెప్పారు. దాడి చేసింది పెంపుడుకుక్క అని యజమానిపై కేసు నమోదు చేయలేదని పోలీసులపై కొందరు పత్రికల్లో వార్తలు రాయడం బాధకలిగించిందని ఎస్‌ఐ విఠల్‌రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. పోలీసులు అయినా కూడా మాకు మానవత్వం ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. మృతి చెందిన చిన్నారి తండ్రి దత్తు కూడా ఊర కుక్క అని చెప్పాడని తెలిపారు. కుక్క దాడిలో ఐదు నెలల చిన్నారి మృతి చెందడం నాకు ఎంతగానో బాధించిందని ఎస్‌ఐ విఠల్‌రెడ్డి అన్నారు. ఆరోపణలు చేసేముందు ఆలోచించాలని హితవు పలికారు.

భార్యతో గొడవపడి వ్యక్తి అదృశ్యం


షేర్‌ఖాన్ (ఫైల్)

పహాడీషరీఫ్: భార్యతో గొడవపడిన ఓ వ్యక్తి ఇంటి నుంచి వెళ్లిపోయిన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. వాదే ముస్తఫా బస్తీకి చెందిన రుబీనాబేగం, షేర్‌ఖాన్(50)లు భార్యాభర్తలు. ఈ నెల 14న షేర్‌ఖాన్ మద్యం తాగి ఇంటికి వచ్చాడు. ఇంటి ఖర్చులకు సంబంధించి భార్య అతన్ని డబ్బులు అడిగింది. ఈ క్రమంలోనే ఇద్దరి మధ్య గొడవ జరగడంతో షేర్‌ఖాన్ ఇంటి నుంచి వెళ్లిపోయాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

మతిస్థిమితం లేని యువకుడి..


బికాశ్‌దాస్ (ఫైల్)

కొత్తూరు: మతిస్థిమితం సరిగ్గా లేని ఓ యువకుడు అదృశ్యమైన సంఘటన కొత్తూరు పట్టణంలో గురువారం ఆలస్యంగా వెలుగుచూసింది. ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలో నివాసం ఉంటున్న బెన్నుదాస్ కుమారుడు బికాశ్‌దాస్(22)కు మతిస్థిమితం సరిగ్గా లేదు. ఈ నేపథ్యంలో బెన్నుదాస్ కుటుంబ సభ్యులు ఈ నెల 6న పనులకు వెళ్లగా ఇంటి వద్ద ఉన్న బికాశ్‌దాస్ బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతడి ఆచూకీ కోసం పలుచోట్ల వెతికిన లభ్యం కాలేదు. దీంతో బెన్నుదాస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

రోడ్డు ప్రమాదంలో తాపీమేస్త్రీ దుర్మరణం


శివ (ఫైల్)

కొత్తూరు: రోడ్డు ప్రమాదంలో తాపీ మేస్త్రీ మృతి చెందిన సంఘటన కొత్తూరు పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల మేరకు.. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం వట్టెం గ్రామానికి చెందిన శివ(43) గత కొన్ని నెలలుగా కుటుంబంతో కలిసి కొత్తూరులో నివాసం ఉంటూ తాపీమేస్త్రీగా పనిచేస్తున్నాడు. గురువారం ఉదయం కొత్తూరు నుంచి తన బైకుపై స్వగ్రామానికి బయలు దేరగా శివారులో పాత జాతీయ రహదారిపై కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైకుపై ఉన్న శివ కిందపడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం షాద్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ఈ ఘటనపై మృతుడి భార్య సువర్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నీటి గుంతలో పడి వ్యక్తి మృతి


భవానీజి మృతదేహం

తలకొండపల్లి: ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి నీటి గుంతలో(పాంపడ్స్) పడి మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని చంద్రధనలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీకాంత్ వివరాల ప్రకారం.. చంద్రధనలో మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. మహబూబ్‌నగర్ పట్టణం నుంచి భవానీజి(45) గత రెండు రోజుల క్రితం చంద్రధనలోని బంధువుల ఇంటికి వచ్చారు. ఆయన గురువారం తెల్లవారుజామున గ్రామ శివారులో ఉన్న నీటి గుంతలో స్నానానికి వెళ్లాడు. ప్రమాదవశాత్తు కాలు జారి నీటి గుంతలో పడిపోయాడు. గ్రామస్తుల సహాయంతో అతడిని బయటికి తీశారు. చికిత్స నిమిత్తం భవానీజిని ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. మృతుడి కుమారుడు శివప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

నిలిచిన ధాన్యం కొనుగోళ్లు

కాలం మారినా రైతుల జీవనంలో మాత్రం మార్పు రావడం లేదు. ప్రకృతి విపత్తులు ఒకవైపు, పాలనాపరమైన నిర్లక్ష్యం మరోవైపు అమాయకులైన అన్నదాతల జీవితాల్లో నూతన వెలుగులు కానరాని పరిస్థితి నెలకొంది. భూగర్భజలాలు తగ్గుతున్న నేపథ్యంలో కొంతమేర పంటనష్టం జరిగినా మిగిలిన పంటను కంటికిరెప్పలా కాపాడుకున్న రైతులకు ధాన్యాన్ని అమ్ముతున్న క్రమంలో కూడా ఇబ్బందులు తప్పడం లేదు.

- హమాలీలు లేరంటూ సాకు
- అకాల వర్షాలతో అన్నదాత ఆందోళన
- పట్టించుకోని అధికారులు


కుస్మసముద్రంలో అమ్మడానికి సిద్ధంగా ఉన్న ఆరబెట్టిన ధాన్యం

కుల్కచర్ల: మండుటెండలకు భూగర్భజలాలు ఎండిపోవడంతో వరిపైరుకు నీరందక అన్నదాతలు అష్టకష్టాలు పడి పంటను కొంత మేర కాపాడుకున్నారు. తీరా పంట చేతికొచ్చిన క్రమంలో కొనుగోళ్ల కేంద్రాల వద్ద ఆరబెట్టిన ధాన్యం అకాల వర్షాలకు తడిసిపోతుందని అన్నదాతలు లబోదిబోమంటున్నారు. ఇబ్బందులు లేకుండా వరి కొనుగోళ్లు చేపడుతున్నామని అధికారులు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో రైతుల ఇబ్బందులు పట్టించుకోనే నాధుడే లేని పరిస్థితి కనిపిస్తోంది. కుల్కచర్ల మండల పరిధిలోని పుట్టపహడ్, అనంతసాగర్, కుస్మసముద్రం, ఇప్పాయిపల్లి గ్రామాల్లోని ధాన్యం సేకరణకు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. పుట్టపహడ్, కుస్మసముద్రం గ్రామాల్లో హమాలీలు లేరంటూ కొనుగోళ్లు నిలిపేశారు. అకాల వర్షాలతో రైతాంగం ఆందోళన చెందుతున్నారు.

తప్పని అదనపు భారం

ఆయా గ్రామాల్లో వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో రైతులకు అదనపు భారం తప్పని పరిస్థితి ఏర్పడింది. కుల్కచర్ల మండల కేంద్రానికి లేదా ప్రైవేటు మిల్లులకు ధాన్యాన్ని విక్రయించే క్రమంలో ధాన్యాన్ని తరలించేందుకు ట్రాక్టర్లకు సాధారణం కంటే కొంత అధిక చార్జీలు చెల్లించాల్సిన వస్తుందని వాపోతున్నారు. కొందరు రైతులు ప్రైవేటు మిల్లులకు ధాన్యాన్ని విక్రయిస్తున్నారు.


అనంతసాగర్‌లో తాలు లేకుండా ఫ్యాన్ గాలికి ధాన్యం శుద్ధి చేస్తున్న రైతులు

కొనుగోలు కొనసాగిస్తాం



స్థానిక రైతుల సూచనల మేరకు హమాలీల సమస్యలతో కొంత ఇబ్బంది నెలకొంది. వాటన్నింటిని పరిష్కరిస్తూ రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోలు కేంద్రాలు కొనసాగేలా చర్యలు తీసుకుంటాం. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అన్నదాతలు జాగ్రత్తలు తీసుకోవాలి.
– వీరస్వామి, వ్యవసాయాధికారి

అకాల వర్షం..అన్నదాత ఆందోళన

- పలు గ్రామాల్లో ఈదురు గాలుల వాన
- తడిసి ముద్దయిన వరిధాన్యం


దోమ: బొంపల్లిలో తడిసిన ధాన్యాన్ని చూపిస్తున్న రైతు మొగులమ్మ

దోమ: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం సాయంత్రం ఒక్కసారిగా ఈదురు గాలులతో కూడిన వర్షం దంచికొట్టింది. దోమ మండల పరిధిలోని బొంపల్లి, శివారెడ్డిపల్లి, బాస్‌పల్లి, గొడుగోనిపల్లి, మైలారం, ఖమ్మంనాచారం తదితర గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. బొంపల్లి గ్రామంలో రైతులు రోడ్లపై ఆరబోసుకున్న వరిధాన్యం పూర్తిగా తడిసిముద్దయింది. ధాన్యం రాశులపై కప్పేందుకు పాలిథిన్ కవర్లు లేకపోవడంతో రైతులు నానా అవస్థలు పడ్డారు. వరి ధాన్యం కుప్పల వద్దకు వర్షం నీరు రాకుండా మట్టితో కట్టలు కట్టి నానా తంటాలు పడ్డారు. అలాగే మామిడి రైతులు ఇబ్బందులు పడ్డారు. ఈదురు గాలులకు మామిడి కాయలు రాలిపోతుండడంతో తీవ్ర నష్టం వాటిల్లిందని పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వికారాబాద్‌లో..

అనంతగిరి: వికారాబాద్‌లో గురువారం ఒక్కసారిగా వర్షం కురిసింది. దీంతో వాతావరణమంతా చల్లగా మారింది. ఇన్ని రోజులు ఎండతో ఉక్కిరిబిక్కిరయిన ప్రజలకు ఈ వర్షంతో కాస్తా ఉపశమనం లభించినట్లయ్యింది. అలాగే అనంతగిరి గుట్టలో భారీవర్షం కురిసింది.


వికారాబాద్‌లో కురుస్తున్న వర్షం

దోమల నివారణతో డెంగీకి చెక్


ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కుల్కచర్ల: డెంగీ నివారణ దినోత్సవంలో భాగంగా గురువారం కుల్కచర్ల మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి వాజుద్దిన్, కమ్యునిటీ హెల్త్ ఆఫీసర్ చంద్రప్రకాశ్ మాట్లాడుతూ.. డెంగ్యూ వ్యాధి వల్ల ప్రజలు తీవ్ర అనారోగ్యంతో ఇబ్బందులు పడే అవకాశం ఉందన్నారు. కొన్ని సందర్భాల్లో ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని సూచించారు. ప్రజలు దోమల నివారణకు వ్యక్తిగత శ్రద్ధ తీసుకోవడంతో పాటు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వైద్యురాలు మాధురి, స్వరూపరాణి, రత్నలత, యాదమ్మ, విజయలక్ష్మి, వెంకటమ్మ, రత్నమ్మ, జ్యోతి, శ్రీలత, మంగమ్మ, భారతమ్మ, జంగమ్మ, సుజాత, గౌరీ, శ్రీనివాస్, సిరాజ్, రఫి, రాజు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కొడుకును చూసేందుకు వెళ్తూ..

- తండ్రి దుర్మరణం
- లారీ డ్రైవర్ నిర్లక్ష్యంతోనే ఘటుకం


అంతయ్య మృతదేహం

యాచారం: ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కుమారుడిని చూడటానికి వెళ్లిన ఓ తండ్రిని లారీ రూపంలో మృత్యువు కబళించింది. ఈ సంఘటన యాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ గోపాల్ తెలిపిన వివరాల ప్రకారం.. నల్గొండ జిల్లా మర్రిగూడ మండలం కుదబక్షాపల్లి గ్రామానికి చెందిన సిరపంగి అంతయ్య(65) కందుకూర్ మండలంలోని నేదునూర్ గ్రామంలో బంధువు మృతి చెందడంతో బుధవారం రాత్రి గ్రామానికి వచ్చారు. అదే క్రమంలో తన కుమారుడు లక్ష్మయ్య అనారోగ్యంతో మాల్ మార్కెట్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోమాలో ఉన్నారు. గురువారం ఉదయం అంతయ్య తన కొడుకును చూడటానికి గ్రామం నుంచి స్కూటీపై బయలుదేరారు. మార్గమధ్యలో మాల్‌లోని ప్రధాన చౌరాస్తాలో స్కూటీని నిలిపాడు. అప్పటికే అక్కడ నిలిపి ఉన్న మహా సిమెంట్ కంపెనీకి చెందిన లారీ డ్రైవర్ వెనకాల ఉన్న స్కూటీని గమనించకుండా కదిలించాడు. దీంతో అంతయ్య లారీ వెనుక చక్రం కింద నలిగిపోయాడు. ఇది గమనించిన స్థానికులు కేకలు వేయడంతో లారీ డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యాడు. సమాచారం తెలుసుకున్న యాచారం పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి తీవ్ర గాయాలైన అంతయ్యను మాల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యుల సూచన మేరకు 108 అంబులెన్స్‌లో నగరానికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలోనే ఆయన మృతి చెందాడు. మృతుడికి భార్య ముత్తమ్మ, ఇద్దరు కూతుర్లు, ఒక కొడుకు ఉన్నారు.

న్యాయం చేయాలని బైఠాయింపు

అంతయ్య మృతితో ఆయన కుటుంబం వీధిపాలైందని, మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని బంధువులు యాచారం పోలీసులకు విజ్ఞప్తి చేశారు. మృతదేహాన్ని ఠాణా ముందే ఉంచి న్యాయం చేయాలని పెద్ద సంఖ్యలో ఆందోళనకు సిద్ధమయ్యారు. సమాచారం తెలుసుకున్న ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అంతయ్య మృతికి కారకుడైన లారీ డ్రైవర్, ఆ కంపెనీపై తగు చర్యలు తీసుకొని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని పోలీసులకు సూచించారు. దీంతో ఆందోళన విరమించారు. అనంతరం మృతదేహాన్ని ఇబ్రహీంపట్నం ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అక్రమ నిర్మాణం ఆపండి

బంట్వారం: మండలంలోని సుల్తాన్‌పూర్‌కు చెందిన ఓ వ్యక్తి సీసీ రోడ్డుతో పాటు మురుగు కాలువను ఆక్రమించి ప్రహరీ నిర్మాణం చేపడుతున్నాడని గ్రామస్తులు గురువారం ఎంపీపీ ప్రభాకర్‌కు ఫిర్యాదు చేశారు. విషయాన్ని సత్వరం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నిర్మాణం నిలిపి వేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి పూజను సంప్రదించగా సదరు వ్యక్తికి నోటీసు జారీ చేసి పనులు నిలిపి వేయించామని చెప్పారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

పరిగి: చెట్టుకు ఉరేసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని నస్కల్‌లో గురువారం చోటు చేసుకుంది. ఎస్సై సంతోష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ముస్తఫా(38), బుధవారం పొలంలో పత్తికట్టె అంటి పెట్టేందుకు వెళ్లి ఇంటి తిరిగి రాలేదు.. దీంతో చుట్టూ పక్కల గ్రామాల్లో ఎంత వెతికిన ఆచూకీ లభించలేదు. గురువారం ఉదయం ముస్తఫా పొలం దగ్గర చెట్టుకు ఉరేసుకొని ఉన్నాడని గ్రామస్తులు చెప్పడంతో కుటుంబ సభ్యులు పొలం దగ్గరికి వెళ్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ముస్తఫాకు మద్యం సేవించే అలవాటు ఉందని, తాగిన మైకంలో ఆత్మహత్య చేసుకొని ఉంటాడని, ఎవరిపైనా అనుమానం లేదని మృతుడి తండ్రి హుసేన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు రాజీనామా

పరిగి: బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆర్ ఆంజనేయులు తన పదవికి గురువారం రాజీనామా చేశారు. మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డికి తన రాజీనామా లేఖను పంపించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ వ్యవహరించిన తీరుకు నిరసనగా రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. తాను బీఆర్‌ఎస్ పార్టీలోనే కొనసాగుతానని కేవలం పదవికి మాత్రమే రాజీనామా చేశానని తెలిపారు.

కంటి చూపుతోనే జీవితం మెరుగు


కంటి పరీక్షలు చేస్తున్న లయన్ హరినాథ్

కొడంగల్ : కంటి చూపుతోనే మెరుగైన జీవనం సాధ్యమవుతోందని లయన్స్ క్లబ్ సభ్యులు పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, వైద్య ఆరోగ్య శాఖ, లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఆప్తాల్మిక్ అధికారి లయన్ హరినాథ్ వైద్య పరీక్షలు చేశారు. 86 మందికి కంటి పరీక్షలు చేయగా అందులో 30 మందిని ఆపరేషన్ల కోసం ఎంపిక చేశారు. వీరికి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని రాంరెడ్డి కంటి వైద్యశాలలో ఆపరేషన్లు చేయనున్నారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ సభ్యులు మాట్లాడుతూ.. పేదలకు సేవ చేయడం అదృష్టంగా భావిసస్తున్నట్లు చెప్పారు. నెలలో ఒకసారి ఉచితంగా ఆపరేషన్లు చేయించి మందులు ఇస్తున్నట్లు చెప్పారు. దంత వైద్య శిబిరం, రక్తదాన శిబిరం, ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం, మొక్కలు నాటడం, చెవిటివారికి వినికిడి మిషన్ల పంపిణీ తదితర కార్యక్రమాలతో పేదలకు సేవ చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సభ్యులు పీఏసీఎస్ చైర్మన్ శివకుమార్‌గుప్తా, డీడీఎస్ జిల్లా అధ్యక్షుడు జయతీర్థాచారీ, క్లబ్ సభ్యులు దాసప్పయాదవ్, మురహరి వశిష్ఠ, శ్రీనివాస్‌గౌడ్, మిఠాయి రాజు తదితరులు పాల్గొన్నారు.

రైతులను దగా చేస్తున్న ప్రభుత్వం


చెంగోల్ వరికొనుగోలు కేంద్రం వద్ద ధర్నా చేస్తున్న బీఆర్‌ఎస్ నేతలు

- దొడ్డు వడ్లకు బోనస్ ఇవ్వాలి
- జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజుగౌడ్

తాండూరు రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజుగౌడ్ ఆరోపించారు. గురువారం మండల పరిధిలోని చెంగోల్ వరికొనుగోలు కేంద్రం వద్ద బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు వీరేందర్ రెడ్డి అధ్యక్షతన రైతులతో కలిసి బీఆర్‌ఎస్ శ్రేణులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజుగౌడ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం కేవలం సన్నవడ్లకే బోనస్ ఇస్తామనడం సరికాదన్నారు. దొడ్డు వడ్లకు కూడా బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలకు పాల్పడుతుందని మండిపడ్డారు. రైతుబంధు, రైతుబీమా ఇవ్వకుండా రైతాంగాన్ని అన్ని రకాలుగా మోసం చేస్తోందని దుయ్యబట్టారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు నయూం, నాయకులు రాజప్పగౌడ్, వెంకటేశం, నర్సిరెడ్డి, శ్రీనివాస్‌చారి, శేఖర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, జెపాల్‌రెడ్డి, వీరారెడ్డి, రాకేష్‌గౌడ్, శేఖర్, ప్రతాప్‌రెడ్డి ఉన్నారు.

ముందస్తు జాగ్రత్తలేవీ?


రెడ్డికుంట చెరువు కట్టకు మట్టిబస్తాలతో రక్షణగోడ

- చెరువు కట్ట పటిష్టతకు చర్యలు తీసుకోవాలంటున్న రైతులు

అబ్దుల్లాపూర్‌మెట్: మూడేళ్ల క్రితం కురిసిన భారీ వర్షాలకు మండలం కేంద్రంలోని రెడ్డికుంట చెరువు, పెద్దఅంబర్‌పేట ఈదులచెరువు, బాటసింగారం బాత్కులచెరువు, కొత్తగూడెం చెరువు, లష్కర్‌గూడ కత్వలకు గండ్లు పడ్డాయి. అప్పట్లో వీటికి నామమాత్రపు మరమ్మతులు చేసి వదిలేశారు. దీంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని రైతులు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అబ్దుల్లాపూర్‌మెట్‌లోని రెడ్డికుంట చెరువు కట్ట పూర్తిగా తెగిపోవడంతో కేవలం మట్టిబస్తాలతో అడ్డుకట్ట వేశారే తప్ప శాశ్వత చర్యలు చేపట్టకపోవడంతో ఇరిగేషన్ అధికారులు తీరుపై స్థానికులు మండిపడుతున్నారు. విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలకు ఈ చెరువు కట్ట తెగిపోతే అంతరాయం ఏర్పడుతుంది. వర్షాకాలం సమీపిస్తున్న వేళ ఎక్కువ ప్రమాదకరంగా ఉన్న చెరువులు, కుంటలపై ఇరిగేషన్ శాఖ అధికారులు ప్రత్యేక దృష్టిని సారించి భారీ నష్టాలు జరగకముందే శాశ్వత మరమ్మతులు చేయాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

తీరని సిలిండర్ కష్టాలు

- గ్యాస్ బండ తెచ్చుకోవాలంటే 32 కిలోమీటర్లు వెళ్లాల్సిందే..



మోమిన్‌పేట: కేంద్ర ప్రభుత్వం ప్రతి కుటుంబానికి సబ్సిడీ కింద వంట గ్యాస్ కనెక్షన్లు ఇచ్చింది. కానీ, వినియోగదారులకు సబ్సిడీ అందక లబోదిబోమంటున్నారు. మండల పరిధిలోని 28 గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం దీపం, ఉజ్వల పథకాల కింద, కొన్ని ప్రైవేటు కనెక్షన్‌లు కలిపి సుమారుగా 14వేల వరకు ఉన్నాయి. హెచ్‌పీ, ఇండేన్, భారత్ తదితర కంపెనీలు సరఫరా చేస్తున్నాయి. ఒక్క ఇండేన్ గ్యాస్ కంపెనీకి ఐదు వేల కనెక్షన్లు ఉంటాయి. ఇండేన్ సరఫరా చేసే ఏజెన్సీ సంగారెడ్డి జిల్లా కోహిర్ మండలంలో ఉంది. గ్యాస్ అయిపోయిందా 32కిలో మీటర్ల దూరంలో ఉన్న కోహిర్‌కు వెళ్లాల్సిందే. ఒక్కోసారి సమయానికి గ్యాస్ లేకపోతే, తిరిగి మరుసటి రోజు వెళ్లాల్సిన పరిస్థితి. ఇలా గ్యాస్ కోసం రవాణా, సమయం వృథా అవుతుందని వినియోగాదారులు వాపోతున్నారు. ఎప్పుడో ఒకసారి వాహనంపై మండల కేంద్రానికి తీసుకువచ్చిన రవాణా చార్జీలంటూ రూ.100 అదనంగా వసూలు చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సబ్సిడీలు వినియోగదారులకు అందడం లేదు. గ్యాస్ సరఫరా చేసే ఏజెన్సీ కేంద్రం దూరంగా ఉండటం వల్ల ఇబ్బందులు తప్పడం లేదని వినియోగదారులు పేర్కొంటున్నారు. మర్పల్లిలో ఉన్న ఇండేన్, నవాబ్‌పేటలో ఉన్న భారత్, వికారాబాద్‌లోని హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీల వారు వారంలో రెండు రోజులు మండలంలోని ప్రతి గ్రామానికి వెళ్లి గ్యాస్‌ను సరఫరా చేస్తున్నారని పలువురు వినియోగదారులు చెబుతున్నారు. కోహిర్‌లో ఉన్న ఇండేన్ ఏజెన్సీ వారు మాత్రమే సరఫరా చేయడం లేదని వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి దగ్గరలో ఉన్న ఏజెన్సీలకు కనెక్షన్‌లు ఇవ్వాలని దీపం వినియోగాదారులు కోరుతున్నారు.

అన్ని మండల కేంద్రాల్లో ఏజెన్సీలు



ప్రతి మండల కేంద్రంలో గ్యాస్ ఏజెన్సీలు ఉన్నాయి. మోమిన్‌పేట మండలంలో ఏజెన్సీ లేక వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. దగ్గరలో ఉన్న వివిధ రకాల గ్యాస్ కంపెనీల ఏజెన్సీలు సరఫరా చేస్తున్నా.. ఇండేన్ ఏజెన్సీ మాత్రం సరఫరా చేయడం లేదు. జిల్లా కలెక్టర్ స్పందించి సమస్యను పరిష్కరించాలని వినియోగదారులు కోరుతున్నారు.
– అన్నపూర్ణ, గ్యాస్ వినియోగదారురాలు, ఎన్కేపల్లి

డీకే అరుణను కలిసిన బీజేపీ నేతలు

షాద్‌నగర్: బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి డీకే అరుణను గురువారం పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాబయ్య ఆధ్వర్యంలో పలువురు నాయకులు హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా షాద్‌నగర్ నియోజకవర్గంలో జరిగిన పోలింగ్ సరళిని ఆమె నాయకులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు హరిభూషణ్, మంగ విజయ్, రంగన్నగౌడ్, బాల్‌రెడ్డి, శంకర్‌నాయక్, సుబ్రమణ్యం, విజయ్ ఉన్నారు.

ఆర్థికసాయం

తలకొండపల్లి: మండల పరిధిలోని గట్టుఇప్పలపల్లికి చెందిన వెంకట్‌రెడ్డి(64) అనారోగ్యానికి గురై గురువారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అదే విధంగా మండల కేంద్రానికి చెందిన కృష్ణయ్య, రామచంద్రయ్య ఇటీవల మృతిచెందగా.. ప్రభాకర్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఒక్కొక్కరికి రూ.3వేల చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రశాంత్‌రెడ్డి, డేవిడ్, జమోహన్‌రెడ్డి, నర్సింహ పాల్గొన్నారు.